నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
13 | హైదరాబాద్, గురువారం 14 మార్చి 2024 | RANGAREDDY

## వైద్యుల సూచన ప్రకారం చికిత్స అందించాలి

### వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, మార్చి 13 : వైద్యుల సూచన ప్రకారం చికిత్స అందించి తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడడం మన బాధ్యత అని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ తెలిపారు. బుధవారం వికారాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో మాతృ, శిశు మరణాలపై అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆశలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భధారణ నుంచి ప్రసవం వరకు ఎలాంటి ప్రమాదకర లక్షణాలు కనిపించినా వెంటనే సంబంధిత వైద్యాధికారికి రెఫర్ చేయాలని, అవసరమైతే పై స్థాయి ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. ఒక సంవత్సరం లోపు పిల్లల మరణాలు జరుగకుండా వైద్యులు, సిబ్బంది జాగ్రత్త వహించాలని సూచించారు. పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌నీలు ఎన్‌క్యూఏఎస్ నిబంధనల ప్రకారం ఉండాలని మెడికల్ ఆఫీర్లను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నివారణకు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

# 'ఉపాధి'కి ఉరి

- ఉపాధి హామీ పథకంపై కేంద్రం కక్ష సాధింపు
- మూడేండ్లలో తగ్గిన 44 లక్షల పనిదినాలు
- 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్లాన్ సిద్ధం
- గతేడాదితో పోలిస్తే 2.98 లక్షల పనిదినాలను తగ్గిస్తూ నిర్ణయం
- వచ్చే ఆర్థిక సంవత్సరం 59.85 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయం
- కేంద్రం అమలుచేస్తున్న కొత్త నిబంధనలతో ప్రతి ఏటా తగ్గుతున్న పనిదినాలు
- లక్షల మంది పేద కూలీలకు దూరమవుతున్న ఉపాధి

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నది. రెండేండ్లుగా ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూలేని కొత్త విధానాలను తీసుకువచ్చారు. ప్రభుత్వ సంస్థలన్నింటినీ ఆదానీలాంటి పెట్టుబడుదారులకు అప్పగించేలా ప్రైవేట్‌పరం చేస్తూ వస్తున్న మోదీ ప్రభుత్వం.. కరువును అభిగమించడమే లక్ష్యంగా గత కొన్నేండ్లుగా నిరుపేదల కడుపు నింపేందుకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకానికి మాత్రం తూట్లు పొడుస్తున్నది. గత ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విధానాలతో ఉపాధి హామీ పనులనే నమ్ముకొని బతుకుతున్న వేల కుటుంబాల కడుపు కొడుతున్నది. కేంద్రం అమల్లోకి తీసుకువచ్చి ఎన్నో కుటుంబాలకు ఉపాధిని దూరం చేసిన కొత్త నిబంధనలపై జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలందరూ మోదీ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2,00,372 ఉపాధి హామీ కుటుంబాలుండగా.. 4,38,398 మంది కూలీలున్నారు.

- వికారాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ)

### సాఫ్ట్‌వేర్‌తో సమస్యలు

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన ఎన్ఆర్ఈజీఎస్ సాఫ్ట్-ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌తో జిల్లాలోని లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. కొత్త సాఫ్ట్‌వేర్ విధానంతో కూలీలు ఉదయం, సాయంత్రం పనులకు తప్పనిసరిగా హాజరుకావాలని షరతులను విధించింది. కూలీలు చేస్తున్న పనులకు సంబంధించి ఉదయం 11 గంటలలోపు ఒక ఫొటో, సాయంత్రం 2 గంటల తర్వాత రెండో ఫొటో తప్పనిసరిగా తీయడంతోపాటు అప్‌లోడ్ చేస్తున్నారు. ఒక గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులకు సంబంధించి ఒక పని పూర్తైన తర్వాతనే మరొక పని చేపట్టాలని నిబంధన విధించారు. దీంతో గతంలో మాదిరిగా కాకుండా పనులు చాలా ఆలస్యమవుతున్నాయి. ప్రతి రోజూ చేపడుతున్న పనులను వెంటనే యాప్‌లో పొందుపర్చాలనే నిబంధనలతో క్షేత్రస్థాయిలో సిగ్నల్ లేకపోవడంతో అప్‌లోడ్ చేయడం ఇబ్బందిగా మారి పనుల్లో కూడా జాప్యం జరుగుతున్నది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిని కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుంటే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలతో ఈ ఆర్థిక సంవత్సరం వేల కుటుంబాలకు ఉపాధి హామీ పనులు దూరమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు పదిహేను రోజులుండగా.. కనీసం 4 వేల కుటుంబాలకు కూడా 100 రోజుల పనిని కూడా కల్పించలేకపోయారు. రెండేండ్ల క్రితం 19,998 కుటుంబాలకు వంద రోజులపాటు పనులను కల్పించగా, గత ఆర్థిక సంవత్సరం కేవలం 1000 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనులను కల్పించగా, ఈ ఆర్థిక సంవత్సరం 3200 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పనిని కల్పించారు.

ఉపాధి హామీ పనులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేస్తున్న డీఆర్‌డీవో శ్రీనివాస్

### నిర్వీర్యం చేసే దిశగా..

పేద ప్రజలకు ఉపాధి హామీ పనులను దూరం చేసేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. లక్షల మంది పేద కుటుంబాల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నీరుగార్చి పథకాన్ని నిలిపివేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తున్నది. ఇందులో భాగంగానే తప్పుడు నివేదికలు తెప్పించుకొని అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ ప్రచారం చేసి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నది. అందుకనుగుణంగానే గత రెండేండ్లుగా ఉపాధి హామీ పనిదినాలను భారీగా తగ్గిస్తున్నారు. కేవలం మూడేండ్ల లోనే 44 లక్షల పనిదినాలను జిల్లాలో తగ్గించారంటే ఉపాధి హామీ పథకంపై మోదీ ప్రభుత్వం ఏ స్థాయిలో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదో అర్థం చేసుకోవచ్చు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 1.03 లక్షల పనిదినాలను తగ్గించగా.. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 31.41 లక్షల పనిదినాలను తగ్గిస్తూ 71.58 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించారు. తదనంతరం 2023-24 ఆర్థిక సంవత్సరంలో మరో 10 లక్షల మేర పనిదినాలను తగ్గిస్తూ 62 లక్షల పనిదినాలను కల్పించాలని నిర్ణయించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మరో 2.98 లక్షల పనిదినాలను తగ్గిస్తూ 59.85 లక్షల పనిదినాలుగా ఉపాధి హామీ ప్లాన్‌ను సిద్ధం చేశారు.

# బోగస్‌కు చెక్

- రేషన్ కార్డుల్లో బోగస్ లబ్ధిదారుల ఏరివేతకు శ్రీకారం చుట్టిన సివిల్ సప్లయ్ శాఖ
- ఇందుకు ఉపకరిస్తున్న ఈకేవైసీ ప్రక్రియ
- బియ్యం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చర్యలు
- రంగారెడ్డి జిల్లాలో చలామణిలో 5.58 లక్షల రేషన్ కార్డులు
- బోగస్ ఏరివేత తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీ

రంగారెడ్డి, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : కొత్త రేషన్ కార్డుల జారీకి సన్నాహాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల్లో చలామణి అవుతున్న బోగస్ సభ్యుల ఏరివేతపై దృష్టి సారించింది. ఈ క్రమంలో రంగారెడ్డిజిల్లాలో రేషన్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. ఇందుకు ప్రస్తుతం జిల్లాలో కొనసాగుతున్న ఈకేవైసీ ప్రక్రియ ఉపకరిస్తున్నది. జిల్లాలో 5.58 లక్షల వరకు రేషన్ కార్డులు చలామణిలో ఉండగా.. ఇప్పటివరకు ఇంకా మూడు శాతం మంది ఈకేవైసీ చేయించుకోలేదు. దీంతో బోగస్ సభ్యుల సంఖ్య లక్షల్లోనే ఉన్నట్లు తెలుస్తున్నది. బోగస్‌ల ఏరివేతతో బియ్యం దుర్వినియోగానికి చెక్ పడుతుందని అధికారులు చెబుతున్నారు.

### వేలాది క్వింటాళ్ల బియ్యం దుర్వినియోగం

రంగారెడ్డి జిల్లాలో వివిధ రేషన్ కార్డులు 5,58,438 ఉన్నాయి. వీటిలో 18,22,762 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి నెలా సివిల్ సప్లయ్ శాఖ 11,562.725 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాను కేటాయిస్తూ వస్తున్నది. ఒక్కో వ్యక్తి పేరిట ఆరు కిలోల చొప్పున రేషన్ కార్డుల్లోని కుటుంబ సభ్యులందరికీ ప్రభుత్వం నెలనెలా బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నది. స్థానికంగా లేనివారు, చనిపోయినవారు, ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పేరిట ప్రతి నెలా బియ్యం పంపిణీ జరుగుతున్నది. ఈ అక్రమాలను అరికట్టేందుకు బయోమెట్రిక్, ఐరిస్ విధానాలను అమలు చేస్తున్నప్పటికీ బోగస్ లబ్ధిదారులను గుర్తించడం కష్టంగా మారింది. దీనికి ప్రధాన కారణం రేషన్ కార్డుల్లోని ఎవరైనా సభ్యుడు ఒకరు డీలర్ వద్దకు వెళ్లి వేలిముద్ర వేస్తే సభ్యులందరికీ బియ్యం పంపిణీ జరుగుతున్నది. దీన్ని ఆసరాగా చేసుకుని అనర్హులు కూడా బియ్యం తీసుకునే పరిస్థితి ఏర్పడింది. ఇలా.. రేషన్ దుకాణాల్లో పొందిన బియ్యాన్ని ప్రైవేటు దళారులకు విక్రయిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ప్రతి నెలా వేలాది క్వింటాళ్ల బియ్యం దుర్వినియోగం అవుతున్నది.

### ఈకేవైసీతో అడ్డుకట్ట

రేషన్ కార్డుదారులు ఈకేవైసీని చేయించుకోవడం ప్రభుత్వం తప్పనిసరి చేసింది. రేషన్ కార్డులోని ప్రతి సభ్యుడు రేషన్ దుకాణానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. లేకపోతే వారి కోటా బియ్యం రద్దవుతుందని చెప్పడంతో చాలా మంది ఉరుకులు పరుగులు పెట్టి ఈకేవైసీ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఈకేవైసీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతున్నది. చలామణిలో ఉన్న రేషన్ కార్డుల్లోని 18,22,762 మంది సభ్యులకుగాను గత ఫిబ్రవరి గడువు నాటికి 1,45,088 మంది(92.04 శాతం) ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. మార్చి వరకు మరోసారి గడువు పెంచడంతో ఇప్పటివరకు 97 శాతం మంది ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలిసింది. ఈ లెక్కన మిగిలిపోయిన మూడు శాతం అంటే ఈకేవైసీ చేయించుకోవాల్సిన వారు ఇంకా లక్షల్లో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ ప్రక్రియ ఆధారంగా సివిల్ సప్లయ్ అధికారులు బోగస్ లబ్ధిదారుల ఏరివేతకు సిద్ధమవుతున్నారు. అనర్హులు ఉంటే ఏకంగా రేషన్ కార్డునే రద్దు చేస్తున్నారు. ప్రతి నెలా 20 శాతం మంది బియ్యం తీసుకోకపోగా.. వీరిలో కొందరు ఒక నెల తీసుకుంటూ మరో నెల వదిలేస్తున్నారు. వీరిపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

### ప్రభుత్వ మార్గనిర్దేశాలకు అనుగుణంగా..

బోగస్ రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియ పూర్తయిన తర్వాతనే కొత్త కార్డులను జారీ చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం సివిల్ సప్లయ్ అధికారుల వద్ద కొత్త రేషన్ కార్డుల కోసం 71,226 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్డులో మార్పులు, చేర్పుల కోసం మరో 8,398 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించాక.. మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో అధికారులు 529 దరఖాస్తులను తిరస్కరించారు. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో 24,796 దరఖాస్తులు కూడా తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం పెద్దఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఆన్‌లైన్ చేసి ఉంచారు. ప్రభుత్వం నుంచి మార్గ నిర్దేశాలు వచ్చిన వెంటనే అందుకనుగుణంగా రేషన్ కార్డులను జారీ చేసేందుకు సివిల్ సప్లయ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోనున్నారు.

## సర్కార్ స్కూళ్లలో.. సకల సౌలత్‌లు

### ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్

- ప్రతి బడిలో అటెండర్, పారిశుధ్య కార్మికుల నియామకం
- సీఎం ప్రకటనతో ఉపాధ్యాయుల్లో హర్షం
- వికారాబాద్ జిల్లాలో 1095 పాఠశాలలకు ప్రయోజనం

బొంరాస్‌పేట, మార్చి 13 : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు మంచి రోజులు రానున్నాయి. గత ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో సమావేశమై పాఠశాలలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. అదేవిధంగా ప్రతి పాఠశాలకు అటెండర్, పారిశుధ్య కార్మికుడిని నియమిస్తామని సీఎం ఉపాధ్యాయ సంఘాలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని వేసవి సెలవుల్లోగా పనులను పూర్తి చేయిస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు.

పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులను ఏర్పాటు చేసి టీశాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు డిజిటల్ పాఠాలు బోధించేలా చూస్తామని చెప్పారు. సీఎం ప్రకటనతో ఉపాధ్యాయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలకు ఉచిత కరెంటు ఇస్తే పాఠశాలలపై ఆర్థిక భారం తగ్గుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.

### పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తాం

వికారాబాద్ జిల్లాలో 1095 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 776 ప్రాథమిక పాఠశాలలు, 116 ప్రాథమికోన్నత, 176 ఉన్నత పాఠశాలలు ఉండగా 9 మాడల్ స్కూళ్లు, 18 కేజీబీవీలు ఉన్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గత ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకం కింద మొదటి విడుతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలలకు కేటగిరి 7 కింద ట్రాన్స్‌కో సంస్థ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నది. యూనిట్‌కు రూ.7చొప్పున విద్యుత్ బిల్లులను వసూలు చేస్తున్నది. ఒక్కో పాఠశాలకు సగటున నెలకు రూ.300 నుంచి రూ.800 వరకు కరెంటు బిల్లు వస్తున్నది. విద్యుత్ బిల్లులను పాఠశాలకు మంజూరయ్యే గ్రాంట్ల నుంచే చెల్లించేవారు. కొన్ని పాఠశాలల్లో విద్యుత్ బకాయిలు రూ.వేలల్లో పేరుకుపోవడంతో హెచ్ఎంలు వాటిని చెల్లించలేక వదిలేశారు. దీంతో కొన్ని పాఠశాలలకు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కరెంటు బిల్లులు చెల్లించే భారం తమపై ఉండదని, అవే డబ్బులను పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తామని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

### నిత్యం పరిశుభ్రతే..

ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు, పారిశుధ్య కార్మికులను కూడా నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అటెండర్లు లేక తరగతి గదులను మధ్యాహ్న భోజన కార్మికులే శుభ్రం చేస్తున్నారు. పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేసేవారు కూడా లేరు. ప్రస్తుతం అటెండర్లు, పారిశుధ్య కార్మికుల నియామకంతో ప్రభుత్వ పాఠశాలల్లో నిత్యం పరిశుభ్రత నెలకొంటుందని హెచ్ఎంలు అభిప్రాయపడుతున్నారు.

### మంచి నిర్ణయం

ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో పాఠశాలకు నెలకు రూ.700 వరకు కరెంటు బిల్లు వస్తున్నది. పాఠశాలలకు వచ్చే గ్రాంట్లు తక్కువగా ఉండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించడం భారంగా ఉండేది. ఫ్రీ కరెంటుతో ఆర్థిక భారం తగ్గుతుంది. అటెండర్లు, పారిశుధ్య కార్మికుల నియామకంతో పాఠశాలల్లో పారిశుధ్య సమస్యలు తీరుతాయి.

**- శ్రీహరిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, చౌదర్‌పల్లి ఉన్నత పాఠశాల, బొంరాస్‌పేట మండలం**

### సీఎం నిర్ణయం హర్షణీయం

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని, ఉచిత కరెంటు సరఫరా చేస్తామని, అటెండర్లు, పారిశుధ్య కార్మికులను నియమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయం. పాఠశాలలకు కరెంటు బిల్లులు చెల్లించడం ఆర్థికంగా భారంగా ఉండేది. ప్రభుత్వ నిర్ణయంతో కరెంటు బిల్లుల భారం తప్పింది. అటెండర్లు, పారిశుధ్య కార్మికుల నియామకంతో పాఠశాలలు నిత్యం పరిశుభ్రతతో ఉంటాయి. డిజిటల్ తరగతి గదుల ఏర్పాటుతో విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్య అందుతున్నది.

**- అనిల్‌కుమార్, పీఆర్‌టీయూ బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు**

## పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగించాలి

### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 13 : జిల్లాలో ఎన్నికల నియమ నిబంధనలు అమలులో ఉన్నందున వాల్ రైటింగ్, పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫ్లాగ్‌లను మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పరిధుల్లో ఫీల్డ్ సిబ్బందిచే తొలగించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో పురోగతి బాగుందని, అన్ని మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఈ నెల 20 వరకు పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. బొంరాస్‌పేట్, తాండూరు, బషీరాబాద్, కొడంగల్ మండలాలవారీగా ఇప్పటివరకు ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఎన్ని పనులు చేయాల్సి ఉంది, ఇంకా చేయాల్సినవి ఎన్నో అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ బిల్డింగ్‌ల నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, అనుకున్న అంచనాల మేరకు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డీఈలు, ఈఈలు, అధికారులున్నారు.

## కన్హాలో గ్లోబల్ స్పిరిచువాలిటీ మహోత్సవం

### అలరించనున్న సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

### మార్చి 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాక

నందిగామ, మార్చి 13 : రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతి వనంలో గురువారం నుంచి ఆదివారం వరకు గ్లోబల్ స్పిరిచువాలిటీ మహోత్సవం నిర్వహించనున్నట్లు బుధవారం కన్హా పీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 15న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధంఖర్ హాజరు కానున్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక గురువులు, సంగీత కళాకారులతో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించనున్నాయి. 100 దేశాలకు పైగా ప్రతినిధులు పాల్గొననున్నారు. మహోత్సవానికి వచ్చేవారికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

## మరిన్ని జంక్షన్లు.. మరింత అందంగా..

- రూ. 26కోట్లతో బేగంపేట, ఆర్‌కే పురం ఆర్వోబీకి మరమ్మతులు
- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదం

సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. 16 అంశాలను ఆమోదించిన కమిటీ సభ్యులు పలు కీలక నిర్ణయాలను తీసుకున్నది. బేగంపేట్ ఆర్వోబీ మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.20కోట్లతో పనులు, రామకృష్ణాపురం (సికింద్రాబాద్) రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌కేపురం ఆర్వోబీ పునరుద్ధరణ చర్యలకు రూ.6 కోట్ల పనులకు పచ్చజెండా ఊపింది. యూసుఫ్‌గూడ బస్తీ జంక్షన్ అభివృద్ధికి అంచనా రూ. 4.90 కోట్లకు, రహ్మత్‌నగర్ పీజీఆర్ విగ్రహం జంక్షన్ అభివృద్ధికి అంచనా వ్యయం రూ. 5.17 కోట్ల పనులకు కమిటీ ఆమోదం తెలిపింది. మిగతా అంశాలను పరిశీలిస్తే..

* జీహెచ్ఎంసీలో ఔట్‌సోర్సింగ్, రెగ్యులర్ సిబ్బంది హాజరు పరిశీలనకు మొబైల్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ (ముఖగుర్తింపు) బయో మెట్రిక్ అటెండెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం అమలు చేసేందుకు, ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ఆహ్వానించేందుకు ఆమోదం తెలిపారు.
* ఆర్‌సీపురం-రాయసముద్రం ట్యాంక్ మిషన్ కాకతీయలో భాగంగా ఇంటెక్-1 నుంచి ఇంటెక్-2 వరకు డ్రైనేజీ మళ్లింపు పనులు, ఇంటరక్షన్ అండ్ డైవర్షన్ (ఐ అండ్ డి) చేపట్టేందుకు రూ.2.52 లక్షల పనులకు టెండర్లు పిలిచేందుకు అనుమతి
* అన్నపూర్ణ భోజన పథకానికి సంబంధించిన ఏజెన్సీ హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌తో ఒప్పందం పూర్తి అయినందున మరో రెండు సంవత్సరాల పొడిగింపునకు ఎంఓయూ కుదుర్చుకునేందుకు కమిటీ ఆమోదించింది.
* బేగంపేట్ ఆర్వోబీ మరమ్మతులు, పునరుద్ధరణ పనులకు రూ.20 కోట్ల అంచనా ప్రతిపాదనకు పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం
* రామకృష్ణాపురం (సికింద్రాబాద్) రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌కేపురం ఆర్వోబీ పునరుద్ధరణ చర్యలకు రూ.6 కోట్ల పనులకు పరిపాలన అనుమతికి ఆమోదం
* ఎల్బీనగర్ నాలుగు జంక్షన్లలో ఎస్ఆర్‌డీపీ కింద చేపట్టిన ఫ్లై ఓవర్ల నిర్మాణానికి రివైజ్డ్ అంచనా వ్యయం మొత్తం రూ.550 కోట్లకు పరిపాలన ఆమోదం. అదనంగా రూ. 67 కోట్లు పెరిగినట్లు అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు.
* యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావు నగర్ డివిజన్‌లలో యూసుఫ్‌గూడ బస్తీ జంక్షన్ అభివృద్ధికి అంచనా రూ.4.90 కోట్లకు పరిపాలనకు ఈ-టెండర్లు పిలవడానికి అనుమతి.
* శేరిలింగంపల్లి సర్కిల్ 19 రహ్మత్‌నగర్ పీజేఆర్ విగ్రహం జంక్షన్ అభివృద్ధికి అంచనా వ్యయం రూ.5.17 కోట్లకు పరిపాలన అనుమతి
* మూసాపేట సర్కిల్‌లో లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్వంత నిధులతో ఇప్పటికే ఉన్న రహదారిని వెడల్పునకు ఆమోదించింది.
* బాలాజీ నగర్ నుంచి బీఎస్ఎన్ఎల్ ఓపెన్ ల్యాండ్ వరకు రూ.599 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే (బాక్స్ డ్రైన్) వరద నీటి కాలువ నిర్మాణానికి కమిటీ ఆమోదం
* బంజారాహిల్స్‌లో వైకుంఠ మహాప్రస్థానం శ్మశానవాటిక సీఎస్ఆర్ పద్ధతిలో మూడు సంవత్సరాల పాటు ఫినిక్స్ ఫౌండేషన్ సంస్థతో ఎంఓయూ చేసుకునేందుకు కమిటీ అనుమతి ఇస్తూ ఆమోదం తెలిపింది.

సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్, ఫాహద్ బిన్ అబ్దుల్ బిన్ అబ్దత్, మహ్మద్ ఖాదర్, పొడవు అర్చన, మహమ్మద్ నసీరుద్దీన్, గౌస్ ఉద్దీన్ మహ్మద్, ఉప్పలపాటి శ్రీకాంత్, సబీహా బేగం, ఆవుల రవీందర్‌రెడ్డి, చింతల విజయశాంతి, కంది శైలజ పాల్గొనగా, కమిషనర్ రోనాల్డ్‌రోస్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, శ్రీవాత్సవ, ఈఎన్‌సీ జియావుద్దీన్, సీఈలు దేవానంద్, కిషన్, అడిషనల్ కమిషనర్లు గీతా మాధురి, చంద్రకాంత్‌రెడ్డి, జయరాజ్ కెన్నెడీ, డాక్టర్ సునంద, జోనల్ కమిషనర్లు అభిలాష, రవికిరణ్, వెంకన్న, ముకుందరెడ్డి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్ పాల్గొన్నారు.